ఆదివారం

ప్రజాశక్తి

మార్చి 30, 2003



హ్యాపీ బర్త్‌డే

(30-3-2003 నుండి 5-4-2003 వరకు)

కె.విశాల్‌దాస్
9సం॥, 30.3.1994
శ్యామల-విజయబాబు
అంతర్వేది-తూ,గో

జి.గోపాలకృష్ణ
సత్యవతి-సత్యనారాయణ
చినగాడపల్లి-తూ.గో

మణిదీప్
గీతారాణి-రమేష్
ఖిల్లాగణపురం-
మహబూబ్‌నగర్

రేణుక
5సం॥, 31.3.1998
శ్యామల-మురళి
ముషీరాబాద్-హైదరాబాద్

శిల్ప
2సం॥, 31.3.2001
బాలేశ్వరి-శ్రీనివాస్
కొత్తకోట-మహబూబ్‌నగర్

బి.ప్రియాంకమౌని
1సం॥, 1.4.2002
విమల-కిరణ్
రాజమండ్రి-తూ.గో



అబ్దుల్ రషీద్(అష్ను)
4సం॥, 2.4.1999
రియాజ్-షరీఫ్
నర్సరావుపేట-గుంటూరు

త్రినాథరెడ్డి
1సం॥, 2. 4. 2002
శ్యామల-శేఖర్
కృష్ణలంక-విజయవాడ

ప్రేమ్‌కళ్యాణ్
ఏప్రిల్-2
అరుణజ్యోతి-కృష్ణారావు
ప్రేమ్‌నగర్-విజయనగరం

తరుణ్‌తేజ
4సం॥, 3.4.1999
నాగవేణి-జగన్నాథరావు
విశాఖపట్నం

నవీన్‌చంద్. ఆర్
4సం॥, 3.4.1999
వెంకటప్పమ్మ-
మురహరిరాజు

హర్షవర్ధన్
వీరాంజనమ్మ-పెంచలయ్య
సిద్ధారెడ్డిపల్లె-
కడప

కె.హరికిరణ్
2సం॥, 3. 4. 2001
లక్ష్మి-బంగార్రాజు
విజయనగరం

వి.బంటి
1సం॥, 5.4.2002
రవిశ్రీ-రవీంద్రనాథ్
పాలకొల్లు

క్షయ ఎలా వ్యాప్తి చెందుతుంది ?

క్షయ వ్యాధి ఎక్కువగా వ్యాధి క్రిములతో కూడిన స్ఫుటము ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది ఊపిరితిత్తుల క్షయకు కారణమవుతుంది. శరీరంలోని ఇతర అవయవాలకు రక్తప్రసరణ ద్వారా వ్యాపిస్తుంది. దానినే వైద్యశాస్త్ర పరిభాషలో హిమటోజీనస్ స్ప్రెడ్‌గా పేర్కొంటారు. వ్యాధిగ్రస్తుల నుండి వెలువడిన స్ఫుటము వాతావరణంలో.. ఎండిపోయి తునాతునకలై పోయి డ్రాప్‌లెట్స్‌గా తయారవుతాయి. ఇవి గాలిలో తేలియాడుతూ మనం పీల్చేగాలి ద్వారా ఊపిరితిత్తులలో చేరతాయి. ఆయా వ్యక్తుల శరీరంలోని రోగ నిరోధక శక్తిని బట్టి వ్యాధి బయటపడటం జరుగుతుంది. స్ఫుటంలో క్షయవ్యాధి క్రిములు కలిగిన ఒక వ్యక్తి సంవత్సర కాలంలో 10-15 మందికి వ్యాధిని వ్యాప్తి చేయగలడు. అందువల్లనే రోగుల స్ఫుటం విషయంలో వ్యాధి వ్యాప్తి నిరోధక జాగ్రత్తలు కీలకపాత్ర వహిస్తాయి.

క్షయ వ్యాధి - లక్షణాలు

- ◆ మూడు వారాలకు దగ్గు, కళ్ళె పడటం.
- ◆ చాలా రోజుల నుండి తగ్గని జ్వరం సాధారణంగా సాయంత్రం, రాత్రి సమయాలలో రావడం, చెమటలు పట్టడం
- ◆ ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఉత్సాహం లేకపోవడం
- ◆ ఛాతిలో నొప్పి, కళ్ళెలో రక్తం, లేదా రక్తపు చారలు కనిపించడం, ఆయాసం.

ఈ పథకం అమలులోకి వచ్చింది. ఈ పథకం కింద ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 446 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ ట్యూబర్‌క్యులోసిస్ సెంటర్ (డి.టి.సి.)లు పని చేస్తున్నాయి. సుమారు 48,000 బెడ్స్‌తో ఆసుపత్రులు పని చేస్తున్నాయి. ఈ పథకం లక్ష్యాలు ఏమిటంటే.
1. తొలి దశలోనే టి.బి. బాధితులను గుర్తించడం
2. క్యూర్‌రేటు పెంచడం (చికిత్స పొందుతున్న రోగిలో బాక్టీరియా క్రిములు లేవని నిర్ధారిస్తే... క్షయక్యూర్ అయినట్టే. క్యూర్ అనేది రోగికి సంబంధించిన విషయం అయినట్టే క్యూర్‌రేట్ అనేది కార్యక్రమానికి సంబంధించిన విషయం. అంటే చికిత్స పొందుతున్న రోగులలో క్యూర్‌రేట్ పెంచడం పథకం లక్ష్యం)
3. స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయడం.
4. రోగికి ప్రత్యక్ష పర్యవేక్షణ చికిత్స (డాట్స్)ను ప్రోత్సహించడం. (ఈ డాట్స్ చికిత్సా విధానంలో, క్షయ మందులను ఆరోగ్య కార్యకర్తల సమక్షంలో మింగించడం ప్రత్యేకత)

భారత ప్రభుత్వం ఇన్ని చర్యలు చేపట్టినా ప్రత్యేక పథకాలను అమలు పరుస్తున్నా, ఇంకా క్షయ వ్యాధి పెద్ద ప్రజారోగ్య సమస్యగానే మిగిలి ఉండడానికి కారణాలు ఏమిటి ?

వ్యాధి నిరోధించే వాక్సిన్ వుంది. వ్యాధికి నూటికి నూరు శాతం నివారించే



మందులున్నాయి. కేంద్ర స్థాయి నుండి.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. సబ్ సెంటర్ స్థాయి దాకా యంత్రాంగం వుంది. అయినా క్షయ ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటూనే ఉంది. కోట్లాది రూపాయలు మాత్రం ఖర్చయిపోతున్నాయి. ఈ విషయం ప్రతి పౌరుడు సీరియస్‌గా తీసుకోవాల్సి వుంది. అన్నిటికి చెప్పే కారణాలే... దానికి చెప్పుకోవడం పరిపాటి అవుతోంది. పేదరికం, జనాభా పెరుగుదల పోషకాహారలోపం, నిరక్షరాస్యత... శాస్త్రీయ అవగాహన రాహిత్యం.. ఎంతకాలం ఈ కారణాలు చెప్పి.. మనల్ని మనం మభ్యపెట్టుకుంటాం. వ్యాధికి ఖర్చు పెడుతున్న కోట్లాది రూపాయలతో... పై సమస్యల్ని కొంతవరకైనా పరిష్కరించలేమా? నేడుచాలా వ్యాధులకు ప్రత్యేక పథకాలున్నాయి. ప్రతి పథకానికి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చయిపోతున్నాయి. వ్యాధుల నివారణలో.. నిర్మూలనలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం లేదు.(కాని పథకాల పుణ్యమా అని పాలకులు, అధికారులు పథకాలలో పనిచేసే ఇతర సిబ్బంది జీవన ప్రమాణాలు మాత్రం చాలా బాగా మెరుగవుతున్నాయి)

ఈ నేపథ్యంలో పాలకులలో, అధికారులలో.. ప్రజలలో అభ్యుదయ మార్పులు రావాలి. ఆ మార్పులు రావడం అంత కష్టతరమైన విషయమేమి కాదు. దేశ పౌరునిగా బాధ్యతాయుతంగా ఆలోచించే విధానాలను అలవాటు చేసుకుంటే ఆ మార్పులు వాటంతట అవే వస్తాయి. ఎవరి విధులేమిటో వారు తెలుసుకుని చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఆశించిన ఫలితాలు అక్కున చేరతాయి.

రోగులు మధ్యలో మందులు మానేస్తున్నారు. అందువల్లనే క్షయ వ్యాధిని అదుపులో పెట్టలేకపోతున్నాం. ఇంకా మరణాలు సంభవిస్తున్నాయి. మందులకు లొంగని క్షయ వృద్ధి చెందుతుంది. ఇది వైద్యులు, ఆరోగ్య సిబ్బంది చెబుతున్న విషయం. మరి డాట్స్ లక్ష్యం ఆ లోపాన్ని సరిదిద్దేందుకు నిర్దేశించినదే. దేశవ్యాప్త యంత్రాంగం ఉంది. వేలాది మంది ఆరోగ్య కార్యకర్తలు డాట్స్‌లో శిక్షణ పొంది వున్నారు. వీరు రానున్న సంవత్సరాలలో ఏ పాటి ఫలితాలు చూపిస్తారో వేచిచూద్దాం. ప్రజలు కూడా ఈ పథకాలలో భాగస్వాములు కావాలి. విద్యావంతులందరూ వ్యాధి నిరోధక కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించగలం. ఎన్ని సమస్యలనైనా అధిగమించి క్షయ వ్యాధిని నిర్మూలించగలం. ◆



నాటకరంగం

* అంపశయ్య నవీన్

చాలా రోజుల తర్వాత మిత్రుడు రామమోహనరావు మా ఇంటికొచ్చాడు. మేం కరీంనగర్లో చాలాకాలం ఆయన బ్యాంకు ఆఫీసర్‌గానూ, నేను కాలేజీ లెక్చరర్‌గానూ పని చేశాం. ఆ రోజుల్లో మేం ఎప్పుడూ ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమంలో కలుసుకుంటుండే వాళ్ళం. ఆయనకు నాటకాలు వేయించడమంటే చాలా ఇంటరెస్టుండేది - అలాగే సంగీత కచేరీలు ఏర్పాటు చెయ్యడమంటే కూడా ఆయనకు చాలా ఆసక్తుండేది. ఉద్యోగరీత్యా ఆయన కరీంనగర్ నుండి ట్రాన్స్‌ఫర్ కావడం, నేను కూడా మరోచోటికి ట్రాన్స్‌ఫర్ కావడంతో మేమిద్దరం ఇరవయ్యేళ్ళుగా కలుసుకోలేదు. ఆయన ఇరవయ్యేళ్ళ తర్వాత నేనుంటున్న వరంగల్‌కే ట్రాన్స్‌ఫరై రావడం, రాగానే నన్ను వెతుక్కుంటూ మా ఇంటికి రావడం నాకు చాలా ఆనందాన్ని కల్గించింది.

"మీరెట్లా ఉన్నారు? మీ నాటక రంగం ఎట్లా ఉంది ?" అన్నాను రామమోహనరావును చూడగానే.

"నేను బాగానే ఉన్నాను... నాటకరంగం కూడా ఫరవాలేదు..." అన్నాడాయన.

"మీరు ఇదివరకటిలాగానే నాటకాలు వేయించడం, సంగీత కచేరీలు ఏర్పాటు చెయ్యడం లాంటివి చేస్తూనే ఉన్నారా?"

"ఇదివరకటంత కాదుగానీ, ఆ కార్యక్రమాలు ఎప్పుడైనా, ఎక్కడైనా జరగటానికి నేను చెయ్యగలిగింది చేస్తూనే ఉన్నాను."

"మీరు కరీంనగర్ నుండి వెళ్ళిపోయాక నేను నాటకాలు చూడటం తగ్గిపోయింది."

"ఈ రోజు నుండి వరుసగా మూడు రోజులు ఇక్కడ నాటక ప్రదర్శనలున్నాయి.. ఇక్కడున్న ఓ సాహితీ, సాంస్కృతిక సంస్థ నాటక పోటీలను నిర్వహిస్తున్నది.. మొత్తం మన ఆంధ్రప్రదేశ్ నుండి తొమ్మిది నాటక సంస్థల వారు ఈ పోటీలో పాల్గొనడానికొచ్చారు. ఈ తొమ్మిది నాటకాల్ని చూస్తే మనకు ప్రస్తుతం మన తెలుగు నాటక రంగం ఎలా ఉందో తెలిసిపోతుంది. పోదాం రండి" అన్నాడు రామమోహనరావు.

నాటకాలు చూద్దామని రామమోహనరావుతో బయల్దేరాను. మేం వెళ్ళేటప్పటికి ఆ పోటీకొచ్చిన మొదటి నాటక ప్రదర్శన ఇంకా ప్రారంభం కాలేదు. థియేటర్లో ఎక్కువ మంది కూడా కనిపించలేదు. ఆరు గంటలకు ప్రారంభమవుతుందన్న ఆ నాటక ప్రదర్శన ఏడింటికి ప్రారంభమైంది. అప్పటివరకు థియేటర్ పూర్తిగా ప్రేక్షకులతో నిండిపోయింది. నలభై ఐదు నిమిషాల సేపు సాగిన ఆ ప్రదర్శన చూశాక నాకు ఫరవాలేదు.. నాటిక బాగానే ఉంది. ఆర్టిస్టులందరూ బాగానే చేశారు... అనిపించింది.

నాకు ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే ఆ నాటకాల్ని చూడటానికి కనీసం ఓ ఐదారువందల మంది ప్రేక్షకులు రావడం.నాటికను చూస్తున్నంత సేపు ఆ నాటికలో లీనమైపోయి చూడటం.. ఓ ఆర్టిస్టు బాగా నటించినప్పుడో, ఓ మంచి సన్నివేశాన్ని ఆర్టిస్టులందరూ కలిసి బాగా పండించినప్పుడో హాలంతా చప్పట్లతో మారుమోగిపోవడం... ఇదంతా చూస్తుంటే తెలుగు ప్రేక్షకులు నాటికల్లో లేక నాటకాల్లో ఆదరించడం లేదని ఎవరంటారు ?

రెండో నాటిక ఇంకా బాగుందనిపించింది. ఆ నాటికను ప్రదర్శిస్తున్నంత సేపూ ప్రేక్షకులు పూర్తిగా నిశ్శబ్దంగా మారిపోయారు. నాటిక పూర్తికాగానే ఓ రెండు మూడు నిమిషాల సేపు చప్పట్లు కొడ్తూనే ఉండిపోయారు. ఆ తర్వాత మూడో నాటికను చూశాను. అది మామూలుగా ఉందనిపించింది. అయినా ఆ నాటికను కూడా ప్రేక్షకులు బాగానే ఆదరించారు. ఇలా వరసగా మూడు రోజులు - నేనూ, రామమోహనరావు కలిసి మొత్తం తొమ్మిది నాటికలు చూశాం.

"ఇప్పుడు చెప్పండి.. మన నాటకరంగం ఎలా ఉందో?" అన్నాడు రామమోహనరావు.

"నేను అనుకున్నదానికంటే బావుంది. నాటికల ఇతివృత్తంలో ఏదో ఒక సమకాలీన సమస్యను హైలెట్ చెయ్యాలన్న తపన ఆ నాటికలు రాసిన రచయితల్లో కనిపించింది. చదువుల పేరుతో పసిపిల్లల్ని మనం ఎలా హింసిస్తున్నామో కొన్ని నాటకాల్లో చూపించారు. అలాగే అమెరికాకు వెళ్ళాలన్న మోజు మన యువతరంలో ఎలా పాకిపోతున్నదో చూపించారు. తమ పిల్లల్ని అమెరికాకు పంపించాలని వాళ్ళ తల్లిదండ్రులే తాపత్రయ పడటాన్ని కూడా చూపించారు. గ్లోబలైజేషన్, లిబరలైజేషన్, హిందూ-ముస్లిం ఘర్షణలు లాంటి సమస్యల వల్ల ఉత్పన్నమవుతున్న పరిణామాల్ని కూడా కొన్ని నాటికలు బాగా చూపించాయి. ఆర్టిస్టుల నటన, ఆహార్యం, వాచకం బాగున్నాయి. మన రంగస్థలాల మీదున్న పరిమితమైన హంగులతో మన ప్రేక్షకుల మీద ఈ నాటికలు ఇంత గొప్ప ప్రభావాన్ని కల్గించాయంటే నేను నమ్మలేకపోతున్నాను. మనం నాటికల్ని ప్రదర్శిస్తున్న థియేటర్లలో ఇంకెన్నో సదుపాయాలుంటే మన నాటక రంగం ఇంకా అభివృద్ధి చెందేదనుకుంటాను. సినిమాలనూ, టీవీలనూ వదిలేసి వరుసగా మూడు రోజులు రోజూ ఐదారువందల మంది ప్రేక్షకులు ఈ ప్రదర్శనలకు రావడం కూడా చాలా గొప్ప విషయమే. కొన్ని నాటికల్లోని ఇతివృత్తాల్ని, డైలాగుల్ని ఆ రచయితలు శ్రద్ధ తీసుకుంటే ఇంకా ఇంప్రూవ్ చేసుకోవచ్చుననిపించింది. అలాగే నటీనటులు కూడా... డైలాగ్ డెలివరీలో ఇంకాస్త సహజత్వాన్ని తీసుకురావచ్చు. సినిమా నటీనటుల్ని అనుకరించాలన్న మోజు కొందరు నటుల్లో కనిపించింది. స్త్రీ పాత్రలు వేసిన నటీనటులంతా బాగా నటించారు. ఇన్ని పరిమితులతో ఇంత మంచి ఫలితాలు సాధించాయంటే హ్యాట్సాఫ్ టు అవర్ నాటక సంస్థలు" అన్నాను...

"మీరు వ్యక్తం చేసిన చాలా అభిప్రాయాలతో నేను ఏకీభవిస్తాను. మన థియేటర్లలో నాటకాలు ప్రదర్శించటానికవసరమైన ఏ సదుపాయాలు లేవు. ఏ బెంగాల్‌కో, మహారాష్ట్రకో, కర్నాటకకో వెళ్ళి చూడండి. అక్కడి పెద్ద నగరాల్లో నాటకాలు ప్రదర్శించటానికి అన్ని హంగులున్న థియేటర్లున్నాయి. మనకు లేవు. రెండో అంశమేమిటంటే మంచి నాటకాలు రాసే రచయితలంటూ మనకు లేరు. మనకున్న మంచి రచయితలు నవలలు రాస్తున్నారు.. కథలు రాస్తున్నారు.. కానీ నాటికలో, నాటకాలో రాయడంలేదు. మీలాంటి ఓ మంచి రచయితను నాటకాలెందుకు రాయడంలేదంటే ఏమని సమాధానం చెబుతారు! నాటకాలు ప్రదర్శించే వాళ్ళెక్కడున్నారంటారు. కానీ ఉన్నారు.. కాకపోతే వాళ్ళంతా ఔత్సాహికులే తప్ప ప్రొఫెషనల్స్ కారు.. మరో అంశమేమిటంటే మొన్న మనం చూసిన నాటికలకు ప్రేక్షకులు బాగానే వచ్చారు. దీన్నిబట్టి మనం ఏమనుకుంటున్నాం.. నాటికలకు ప్రేక్షకుల ఆదరణ బాగానే ఉందని' ఈ ప్రదర్శనలకు అందర్నీ ఫ్రీగా, టికెట్ లేకుండా రానిచ్చాం కాబట్టి ఇంతమందొచ్చారు. ఇవే ప్రదర్శనలకు టిక్కెట్స్ పెట్టామనుకోండి.. ఐదువందల మందికాదు కదా వంద మంది కూడా రారు. ఇప్పుడొచ్చిన ఈ ఐదువందల మందే టిక్కెట్స్ పెట్టినప్పుడు కూడా వస్తే మన నాటకరంగం ఇంకా బాగు పడుతుంది.." అన్నాడు రామమోహనరావు.

"నిజమే" అన్నాను నేను. ◆

...ల్లో ఎవరున్నారో!

...ముందుకెళ్లే పడవ

హలో...

...రం మీకు నీళ్లల్లో ముందుకు వెళ్లే పడవ గురించి ...టున్నాను. తెలుసుకోవాలనుందా! అయితే ముందుగా ... కాగితం తీసుకుని పడవ తయారుచేయండి. ...డవ చేయడం వచ్చుగా. నీళ్లున్న గిన్నెలో వదిలి ...ఉంది. 'ఏమీ కాలా. మేం ఎక్కడ వేశామో అక్కడే ...న్నారా? మరి నాకేంటీ ..... పడవ ముందుకు ... ఓ మర్చిపోయాను. నేను పడవ ముందు భాగంలో ...క్క పెట్టాను. పైగా చిన్న రంధ్రం చేశాను. అందుకే ...కు వెళుతుంది. ఎలాగంటే... నీటికి తలతన్యత ఎక్కువ. ...టి తలతన్యత తగ్గుతుంది. తలతన్యతలో తేడా పడవను ...గుతుంది. అయితే ఇలా పడవ కొంత సేపు తిరిగే సరికి ...ా సబ్బు నీరుగా మారుతుంది. అప్పుడు తలతన్యతలో ... అప్పుడు ఇక పడవ ముందుకి వెళ్లదు.



బాదంకాయ భయం

ఓ సారి నసీరుద్దీన్ కుమారునికి బాదంకాయ దొరికింది. అందులో పప్పు తినాలని పించింది వాడికి. ఓరాయి వెతికి తీసుకున్నాడు. ఓ చేత్తో బాదంకాయ పట్టుకుని రాతితో పగులకొట్టడం మొదలు పెట్టాడు. ఒక్కో దెబ్బ వేస్తూ వుంటే అది ఎగిరి ఎగిరి పడతావుంది. 'దీని పని ఇట్లా వుందా!' అని ఒకసారి గట్టిగా కొట్టాడు. అంతే అది చీకట్లో కనపడకుండా ఎక్కడో పడిపోయింది. వాడికి ఏడుపు వచ్చింది. ఏడ్చేశాడు. బుగ్గలమీదుగా కన్నీళ్లు కారుతూ వుండగా.... తండ్రి నసీరుద్దీన్ దగ్గరకు వెళ్లి 'నాన్నా... నాన్నా... రాయితో కొడుతుంటే బాదం కాయ ఎగిరిపోయింది' అని ఇంకా పెద్దగా ఏడ్చేశాడు.



నసీరుద్దీన్ వాడి కన్నీళ్లు తుడిచి 'లోకం తీరు అంతేరా నాయనా! ప్రేమతో పిలిస్తే వస్తారు. కొడితే వెళ్లిపోతారు. నీవు దాన్ని పగులకొడదామని చూశావు. అదేమో చావుకి భయపడి పారిపోయింది. బాదంకాయకు కూడా చావంటే భయమే చూశావా!' అని కొడుకుని ఓదార్చాడు.

కలం స్నేహం

పేరు: బి.దీపిక,
వయసు : 11 సం॥
చదువు :6 వతరగతి
హాబీలు :కథలు చదవడం, డాన్స్ చేయడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : బి.దీపిక, డాటరాఫ్ బి.వెంకటేశ్వర రావు, ఇ.నెంబరు1-6-174/బి/18, గంగపుత్రకాలనీ,బాపూజీనగర్, హైదరాబాదు.

పేరు: కె. సూర్యప్రకాష్,
వయసు : 10 సం॥
చదువు :5 వతరగతి
హాబీలు: క్రికెట్-ఫుట్‌బాల్-ఛెస్ చూడడం,ఆడడం.
పూర్తి చిరునామా : కె.సూర్యప్రకాష్, సన్నాఫ్ సాయికుమార్, టిటిసి క్వార్టర్స్-11, లాల్‌బజార్, తిరుమలగిరి.

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

జ	?
పి	
ల	
సు	
శ్రో	
రా	

గతవారం జవాబులు

నీ	ద
	వు
	రు
	లం
	టు
	చం

మినీకథ

సంతానస్యమస్య గుళికలు

✻ రుక్మిణి

ఆ టవున్లో పిచ్చమ్మ పిచ్చయ్యలది అన్యోన్య దాంపత్యం. వాళ్ళని ఎరిగిన వాళ్ళందరూ ముక్కున వేలేసుకుంటారు. 'మేడ్‌ఫర్ ఈచ్ అదర్' అనీ – 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్... దిస్ కపుల్ పెర్‌ఫెక్ట్లీ ఫ్రం హెవెన్' అని కూడా పొగుడుతుంటారు.

పిచ్చయ్యకు మంచి జీతం... హోదా... పలుకుబడీ అయితే పిచ్చమ్మది మంచి ఆరోగ్యం, చక్కటి అందం... నిలువెత్తు నిజాయితీ ఆమె సొంతం కావడంతో వారి దాంపత్యం సమాజంలోనే ఆదర్శప్రాయంగా మారిపోయింది. పైగా పిచ్చమ్మ పరమ భక్తురాలు... కోటిన్నొక్క దేవతలకు కొండబిగించి మరీ పూజలవీ చేస్తుంది – పిచ్చయ్య ఆస్తిక శిఖామణే కావడం చేత తన యథాశక్తిని భక్తి భావాల్ని ప్రకటించుకుంటూ అందరికీ ఆదర్శంగా వుండడానికి బాగా తాపత్రయ పడిపోతుంటాడు. లానాదేనా అట్లాంటి అన్యోన్య దాంపత్యం ఆలోచనల్లో... ఊహల్లో... రాతల్లోనే వుంటుందనుకునే వారికి అదో చెంపపెట్టు!

పెండ్లయి చాలా కాలమైనా వారికి సంతానం కలిగించడంలో కోటిన్నొక్క దేవతలలో ఎవరూ కనికరించకపోవడమే చాలా విచారకరం! ఆ విషయం తలుచుకున్నపుడు మాత్రమే వారి గుండెలు బరువెక్కి అక్కడి వాతావరణాన్ని విషాదమయం చేసేస్తుంది. నోములు... వ్రతాలు... ఉపవాసాలు.. వారాలు.. అన్నీ గడిచి, ఆశ చావబోయే సమయంలో పిచ్చయ్యకు ఆధునిక వైద్యశాస్త్రం... శాస్త్ర విజ్ఞాన పురోగతి స్ఫురించాయి. వెంటనే పేరుమోసిన డాక్టరుగారి దగ్గరకు తానుగా వెళ్ళి అన్ని రకాల పరీక్షలు ముగించుకున్నాక తేలిందేమిటంటే 'సంతానం కలక్కపోవడానికి తానే సంపూర్ణ బాధ్యుడు.. తనకా 'యోగం' శారీరకంగానే లేదు సుమా!" అని తేలడంతో విషణ్ణ వదనుడై ఇంటి దారి పట్టాడు.

పిచ్చమ్మ పతివ్రతా శిరోమణి కావడం వల్లనూ.. భర్తగారంటే పంచప్రాణాలు కావడం చేతనూ.. ఇంకా 'ఆశ' చావక పూజలనూ... వ్రతాలనూ నిర్విరామంగా కొనసాగిస్తూనే వుంది. అయితే ఏ సందర్భంలోనూ "పిల్లలూ... బుల్లి మాటలూ... పాల బుగ్గలూ... వసిడి చిందులు... బులిబులి తప్పటడుగులు....' వంటి ప్రస్తావనలు తమ సంభాషణల్లోకి రాకుండా బహుశా జాగ్రత్తలు భారీగా తీసుకుంటూ ఆ 'ప్రశాంత కుటుంబ వాతావరణాన్ని' చాలా ప్రశాంతంగా వుంచే ప్రయత్నం చేస్తుంది. పాపం!

మనిషిలో ఆశ చావనపుడు... కోరికలు తీరే అవకాశం లేనపుడు వాటికి గల సహేతుక కారణాలను కూడా సందేహించే పరిస్థితికి జారడం సహజం! అలాంటి స్థితిలో వున్న పిచ్చయ్యకు ఒకనాటి ఉదయం ఒకానొక తెలుగు వారపత్రికలోని ప్రకటన అత్యంత ఉత్సాహాన్నీ... అంతకుమించి 'తాత్కాలిక ఆనందాన్నీ' కలగజేశాయి. పురోగమించిన ఆధునిక వైద్యశాస్త్రం కూడా చేయలేని పనులు మన పూర్వీకులు... మునులు... వేదకాలం నాటి పురుషోత్తములు చూసిన దాఖలాలున్నాయి గదా! అని నిర్ణయానికి వచ్చిన వాడై ఆ ప్రకటనలోని భిషగ్వరుని వద్ద వాలాడు. ఫీజు మొత్తం కోర్సుకు చాలానే వుందిగానీ, మొదటి విడత ఆ 'సంతానస్యమస్యమూలికా గుళికల' బాటిలును వైద్యుడు గారు ఒక వేయి రూపాయలు పుచ్చుకుని అందించాడు. ఆ సీసా నల్లరంగులో... దాని మూత బంగారపు పూతతో ధగధగా మెరుస్తోంది!

''చూడు సారూ.. కోర్సు రోజూ రెండుపూటలా... ఒకే టైంల వీటిని సేవించాలి. క్రమం తప్పకూడదు సుమా! మాత్ర మింగి నీళ్ళు తాగి, గ్లాసెడు పచ్చిపాలు బిగించి పట్టించాలి... ఇది ఈ హోల్‌మొత్తం ఇండియాలో పవర్‌ఫుల్ మందు – ఒరిజినల్..."

"అయితే పిల్లలు గ్యారంటీ గదా..."

"మీరు మాత్రలు గ్యారంటీ టైం ప్రకారం వాడడాన్ని బట్టి రిజల్టు ఉంటుంది. పచ్చిపాలు మాత్రం చాలా ముఖ్యం...!" అని గంభీరంగా ప్రకటించాడు.

పిచ్చయ్య మహద్భాగ్యమని ఆ సీసాను కడు భక్తిగా అందుకుని వాడికి ఓ నమస్కారం పడేశాడు.

"మరోమాట.. గుళిక మింగి పచ్చిపాలు తాగేటపుడు నీ బలమైన స్ట్రాంగు కోరికను మాట మాటకూ తలుచుకోవాలె!" అని ముందు జాగ్రత్తలు కూడా చెప్పాడు!

* * *

నెలలు గడుస్తున్నాయి – పిచ్చయ్యగారు పచ్చిపాలు తాగుతూనే వున్నాడు. మనసులో పసివాండ్ల కేరింతలూ.. తప్పటడుగులూ.. పదేపదే పలవరిస్తూనే గుళికలు మింగుతున్నాడు. అయితే అడపా దడపా ఆ ఆత్రాన్నంతా ఓరగంట గమనించిన పిచ్చమ్మ మనసు పిచ్చి ఆందోళనకు గురై విలవిల్లాడి పోయింది. మనసు నిండుగా పిచ్చి ప్రేమలో... కూరుకుపోవడం వల్ల ఆ నరక యాతన తప్పని అబల గదా!

ఓ రోజు –

యథావిధిగా పిచ్చయ్య చుట్టుపక్కల జాగ్రత్తగా చూసుకుని, గుళిక సేవనం... పచ్చిపాల ఔపోసనం కానిచ్చిన తరువాత ఆ గుళికల సీసా వంక అనుమానంగా చూశాడు. అసలు రాత్రి దాన్ని తానుంచిన చోటు నుండి గాక యథాలాపంగా వేరే చోట నుండి అప్రయత్నంగానే తీశాడు. అయితే తానుగానీ నిన్న పొరపాటున అక్కడ దాన్ని పెట్టలేదే! ఊహుం.. మరి? కంటికట్లా కనిపించగానే 'వేళాయెరా' అన్న ఆత్రం కొద్దీ అందుకుని లపలప మింగేశాడు. రోజూ తాను సేవించే సీసాలో నిన్న అయిదారు గుళికలే వుండాల్సిందీ... బాగా గుర్తు.. మరి? మరిందులోనేమో సగానికి పైగా నిండుగా వున్నయ్యే...? హబ్బా....!

"పిచ్చమ్మా డార్లింగ్... ఓసారిలారా! కమాన్.. ఈ గుళికల సీసా ఎక్కడిదండీ? అహఁ... ఎవరైనా తెచ్చారా... నువుగాని కాదుగదా? ఏంటి.. నువ్వేనా... హ.... ఆఁ... ఆ బవిరిగెడ్డం వైద్యుడిగాడి దగ్గిరే... ఆర్నీ.. వెయ్యి రూపాయలు పుచ్చుకున్నాడా... అరె... మాట్లాడవేం..."

ఆ అన్ని ప్రశ్నలకూ పిచ్చమ్మ 'అవునవునంటూనే' గంగిగోవులా తలాడించింది – హఠాత్తుగా పిచ్చయ్యకు ఎన్నడులేంది బుర్రంతా గిరగిరా తిరిగినట్లయ్యింది.

"నీకెందుకే? వీట్ని వాడాలనీ... అదే మింగాలనీ నీకెందుకనిపించింది ? అసలు ఆ ఆలోచన నీకెందుకు వచ్చిందే? ఎవడు చెప్పాడు? ఎందుకు చెప్పాడూ ? ఏమిటి కథా?" పిచ్చయ్య లాలనగానే అడగడంలో పిచ్చమ్మ తేరుకుని వివరం వివరించింది. ఆ వివరం ఒళ్లు జలదరించేలానే వుంది!

"మీ వైద్య పరీక్షలు... డాక్టరు రిపోర్టు అంతా చూశాను... చదివాను.. ఏవండీ... మీరంటే నాకు పిచ్చిప్రేమ 'మీకు పిల్లలు కలిగే అవకాశం లేదని మీకు తెలిసినంతగా నాకూ తెలిసిపోయింది. నేనేమో పరమ పతివ్రతను. గొప్ప భక్తురాలిని కూడా గదా! మీ నమ్మకం వమ్మై నేనుగానీ అనుకోకుండా నీళ్ళుగానీ పోసుకుంటే... ఎంతైనా మగజాతి మీది.. అంతా ఒకటే.. మీరంటేనేమో ప్రేమ...పిచ్చి..! ఆ దెబ్బను మీరు నిభాయించి తట్టుకోలేరు. అందుకని ఆ గెడ్డం డాక్టరు దగ్గరకు పోతే... మీరు పోయినట్లు ఇవాల్టిదాకా నాకు తెలవదు.... ఒట్టు... వాడు నాకు ఈ 'సంతానస్యమస్య' గోళీలిచ్చాడు – ఇది రోజూ ఒకటి మింగి పచ్చిపాయి తాగితే ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లా పీచూ పుట్టే సమస్యే లేదని ఖరాకండీగా బల్లగుద్ది గ్యారంటీ ఇచ్చాడు – అద్భుత సంతాన నిరోధకం... మూడ్నాలుగు నెలల్నుండీ వాడుతున్నా..

పిచ్చయ్య బుర్ర మళ్ళా గిరగిరా తిరిగిపోయింది. ఎందుకంటే ఆ రెండు సీసాల్లోనూ వున్న మాత్రలు ఒక్కటేనాయె! ◆

ఈ యోధులు లేని లోటు పూడ్చలేనిది

ప్రపంచకప్ క్రికెట్ ఛాంపియన్ షిప్ ముగిసింది. ఈ టోర్నీతో పాటు కొంతమంది ప్రఖ్యాత క్రికెటర్ల కెరీర్ కూడా ముగిసింది. ఇప్పటివరకు మైదానంలో అద్భుత ప్రతిభ కనబర్చి అభిమానులను అలరించిన పలువురు ప్రముఖ ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పారు. శ్రీలంక వెన్నెముక అరవింద డి సిల్వా, డేరింగ్ బ్యాట్స్‌మన్ ఆండీ ఫ్లవర్, అలెన్ డొనాల్డ్, ప్రముఖ ఫీల్డర్ జాంటీ రోడ్స్, స్టయిలిష్ ఓపెనర్ గ్యారీ కిర్‌స్టన్...ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాలా పెద్దదవుతుంది. ఇంతమంది ప్రముఖ క్రికెటర్లు ఒకేసారి గుడ్‌బై చెప్పడంతో అభిమానులు బాధ పడుతున్నారు.

* ఎం.డి. హసన్ షరీఫ్

నిరాశతో వైదొలగిన డిసిల్వా

ఉత్తమ ఆల్‌రౌండర్లలో ఒకడైన అరవింద డి సిల్వా 1996లో శ్రీలంక ప్రపంచ విజేతగా నిలవడంలో కీలకపాత్ర వహించాడు. అయితే తన కెరీర్ చివరి మ్యాచ్‌లో 11 పరుగులకే రనౌట్ అవడం అతన్ని నిరాశకు గురిచేసింది. 1996 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియాపై అతను సెంచరీ చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ ప్రపంచకప్‌లో ఆసీస్ చేతిలోనే లంక సెమీస్‌లో ఓటమిపాలైంది. "మేం చాలా కష్టపడినప్పటికీ మా ప్రతిభను ఆసీస్‌పై సరిగ్గా కనబర్చలేక పోయాం. అందుకే ఓటమిపాలయ్యాం" అని సెమీస్‌లో ఓటమి తర్వాత డి సిల్వా పేర్కొన్నాడు. 1984 ఆగస్టులో ఇంగ్లండ్‌తో లార్డ్స్ మైదానంలో జరిగిన టెస్ట్‌మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగిడిన డి సిల్వా మొత్తం 93 టెస్ట్‌మ్యాచ్‌లు, 308 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. మొత్తం ఐదు ప్రపంచకప్‌లలోనూ అతను పాల్గొన్నాడు. టెస్టుల్లో 42.97 సగటుతో మొత్తం 6,361 పరుగులు చేశాడు. వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన మూడవ ఆటగాడిగా డి సిల్వా (9,284 పరుగులు) నిలిచాడు.

వివాదాస్పదంగా వైదొలిగిన ఫ్లవర్

జింబాబ్వే వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ ఆండీ ఫ్లవర్ కూడా అంతర్జాతీయ క్రికెట్ నుండి వైదొలిగాడు. ఇటీవల వరుసగా విఫలమవడంతో పాటు రాజకీయంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందున జింబాబ్వే జట్టులో అతని స్థానం ప్రమాదంలో పడింది. ప్రముఖ ఆటగాళ్లలో ఒకడైన ఫ్లవర్ ప్రపంచకప్‌లో జింబాబ్వే ఆడిన తొలి మ్యాచ్‌లో బౌలర్ హెన్రీ ఒలొంగాతో కలిసి చేతికి నల్ల పట్టీ ధరించి నిరసన ప్రకటించాడు. "జింబాబ్వేలో ప్రజాస్వామ్యం హత్యచేయబడింది" అని 34 ఏళ్ల ఫ్లవర్ నిరసన వ్యక్తం చేశాడు. టెస్టుల్లోనూ, వన్డేల్లోనూ అత్యధిక పరుగులు చేసిన జింబాబ్వే ఆటగాడిగా ఫ్లవర్ రికార్డు నెలకొల్పాడు. ఈనెల 15వ తేదీన శ్రీలంక చేతిలో జింబాబ్వే ఓటమి తర్వాత తన రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. అతను చేసిన 38 పరుగులే ఆ మ్యాచ్‌లో జింబాబ్వే ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరు. 63 టెస్టులు ఆడిన ఫ్లవర్ 51.54 సగటుతో 4,794 పరుగులు చేశాడు. 213 వన్డేల్లో 35 పరుగుల సగటు సాధించడం విశేషం. "నేను ఇంకా ఆడాలనుకున్నాను. కానీ నా రిటైర్మెంట్ ప్రకటన వెనుక చాలా కారణాలున్నాయి. జింబాబ్వేలో రాజకీయ పరిస్థితి కూడా నా నిర్ణయానికి ఒక కారణం. ఈ విధంగా నిష్క్రమించడం ఎవరికైనా బాధాకరమే. అయితే ఇప్పుడు నా కుటుంబంతో గడపాల్సిన సమయం ఆసన్నమైంది. అయితే జింబాబ్వే క్రికెట్ అభివృద్ధికి నావంతు కృషి చేస్తాను" అని ఫ్లవర్ తన రిటైర్మెంట్ ప్రకటనలో పేర్కొన్నాడు. అయితే అతనికి దేశ క్రికెట్ బోర్డులో ఏదైనా పదవి లభిస్తుందో లేదో ఇంకా స్పష్టం కాలేదు.

అలెన్ డొనాల్డ్

గ్యారీకిర్‌స్టన్

జాంటీ రోడ్స్


ఆండీఫ్లవర్


అరవింద డిసిల్వా

ముగ్గురు దక్షిణాఫ్రికా క్రికెటర్ల గుడ్‌బై

పలువురు యువ క్రికెటర్లకు మార్గదర్శకుడిగా నిలిచిన అలెన్ డొనాల్డ్ కూడా గుడ్‌బై చెప్పాడు. 36 ఏళ్ల డొనాల్డ్ ఈనెల 8వ తేదీన క్రికెట్ నుండి వైదొలుగుతున్నట్లు తెలిపాడు. 1990లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునఃప్రవేశం చేసిన దక్షిణాఫ్రికా జట్టులో డొనాల్డ్ ముఖ్య భూమిక నిర్వహించాడు. వయస్సు పైబడినందున అతను చివరి దశలో అంతగా రాణించలేకపోయాడు. దీంతో ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా ఆరు మ్యాచ్‌లలో పాల్గొనగా డొనాల్డ్ మాత్రం మూడింటిలోనే ఆడాడు. ఆ మూడు మ్యాచ్‌లలో అతను మొత్తం 133 పరుగులు చేయడంతో పాటు ఒక వికెట్ కూడా తీసుకున్నాడు. అతను టెస్టుల్లో మొత్తం 330 వికెట్లను, వన్డేల్లో 272 వికెట్లను సాధించాడు. క్రికెట్‌కు ఇక సెలవు అని ప్రకటించిన మరో దక్షిణాఫ్రికా ఆటగాడు జాంటీరోడ్స్. ప్రపంచంలోనే ఉత్తమ ఫీల్డర్, ప్రముఖ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ అయిన రోడ్స్ గుడ్‌బై చెప్పడం అంతర్జాతీయ క్రికెట్‌కు తీరని లోటు. ప్రపంచకప్‌కు ముందే రోడ్స్ వేలికి గాయమైంది. దీంతో ప్రపంచకప్‌లో చివరిసారిగా పాల్గొనాలన్న అతని కోరిక నెరవేరలేదు. గాయం మానడానికి కనీసం మూడు వారాలు పడ్తుందని డాక్టర్లు ప్రకటించి నందున ఈ కీలక ఆటగాడు ప్రపంచకప్‌లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేక పోయాడు. గ్రూప్-బిలో కెన్యాతో జరిగిన మ్యాచ్‌లో ఒక క్యాచ్ తీసుకునే ప్రయత్నంలో అతని వేలికి గాయమైంది. రోడ్స్ నాలుగు ప్రపంచకప్‌లలో పాల్గొన్నాడు. ఇతను వన్డేల్లో ఎక్కువ దృష్టి నిలిపేందుకు, కుటుంబంతో ఎక్కువ సమయం గడిపేందుకు 2000వ సంవత్సరంలోనే టెస్ట్ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించాడు. 52 టెస్టుల్లోనూ, 245 వన్డేల్లోనూ పాల్గొన్న రోడ్స్ బ్యాటింగ్ సగటు 35 పరుగుల కంటే ఎక్కువే. మరో దక్షిణాఫ్రికా ఆటగాడు, ప్రముఖ క్రికెటర్లలో ఒకడైన గ్యారీ కిర్‌స్టన్ కూడా వైదొలిగాడు. టెస్ట్ క్రికెట్‌లో కొనసాగుతానని ప్రకటించిన ఇతను వన్డేల్లో ఓపెనర్‌గా బరిలోకి దిగేవాడు. ఇప్పటివరకూ తమదైన శైలితో క్రికెట్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన ఈ యోధులు లేనిలోటు పూడ్చలేనిది. ఇంతమంది యోధులు ఒక్కసారిగా వైదొలగడం క్రికెట్ ప్రపంచానికి తీరనిలోటు. ◆

కరివేపాకు మామ్మ

* డా॥ విజయ బక్ష్

రేణుక ఒక్కసారిగా ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. ఎదురుగా గడియారం 5 గంటలు చూపడానికి పది అడుగులు వేయాల్సి వుంది. ఫర్వాలేదు మరో పది నిముషాలు ఆగి లేవవచ్చును అనుకొంటూ మళ్ళీ కళ్ళు మూసుకొని పడుకొంది. అయినా లేచింది మొదలుకొని చేసేది పనే కదా! అనుకొంటూ తనలో తాను గొణుక్కొంది.. పని.. పని.. పని, నిరంతరం పని... అసలు ఈ పనులు చేసి చేసి తాను అరిగి పోయిందేమో కూడా! ఇంట్లో పని... ఆఫీసులో పని. జీవితమంతా ఇట్లా పని చేస్తుండమని భగవంతుడు తన ముఖాన వ్రాసాడేమో! ఆయన అట్లా తన రాతరాస్తే తానెవరు తప్పించుకోవటానికి. లేస్తూనే ఈ ఇంటెడు చాకిరీ చేయాలి. యుద్ధరంగమంటి వంటింట్లో గిన్నెలు, గరిటెలు వగైరా ఆయుధ సామాగ్రితో కుస్తీ పట్టాలి. లేవటానికి బద్ధకంగా అనిపించి కళ్ళు గట్టిగా మూసుకొంది రేణుక. గడియారం గద్దించినట్లు 'ఇంకా లేవవా ఏమిటి?' అని గణగణగంటలు కొట్టింది. కళ్ళు తెరిచి లేచి కూర్చుని, పక్కనే హాయిగా నిద్రపోతున్న పవన్‌ని చూసి నిట్టూర్చింది. 'తనకేం మగ మహారాజు. ఏ ఏడింటికో నిద్రలేస్తాడు.' అనుకొంటూ బెడ్‌మీద నుండి లేచింది. బ్రష్ చేసుకొని, వంటింట్లోకి వెళ్ళి స్టౌ ముట్టించి గబగబ కాఫీ కలుపుకొని కప్పుతో వరండాలోకి వచ్చింది.

అపుడపుడే తెలవారుతున్నది. కనీకనిపించని వెలుగు చీకటిని తరిమి కొడుతున్నది. సుప్రభాతపు గాలి చల్లగా మెల్లగా శరీరాన్ని స్పృశిస్తున్నది. కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతున్న రేణుకకు ఈ వాతావరణం మనస్సుకెంతో హాయినిచ్చింది. ట్రింగ్‌మని సైకిల్ బెల్ మోగిస్తూనే పేపర్‌బాయ్ గేట్‌లో పేపర్ విసిరివేశాడు. పేపర్ తీసుకొని ఒక్కసారి హెడ్‌లైన్స్ అన్నీ పరికించి చూచింది. పేపరంతా బాగా చదవటం మొదలెడితే టైమ్ చాలదు మిగతా పనులకని పేపర్‌ని టీపాయ్ మీద పడేసింది. మళ్లీ మరొక్కసారి 'ఛీ! వెధవ జీవితం! పేపర్ కూడా చదవటానికి లేదు! హాయిగా కాఫీ తాగుతూ ఎంజాయ్ చేయటానికి లేదు..' అనుకొంటూ లేచింది. వంట ఇంట్లోకి వెళ్ళి కుక్కర్‌లో అన్నీ పెట్టి స్టౌ మీద పెట్టింది. మరొకవైపు ఇడ్లీ కుక్కర్ పెట్టింది. ఈలోగా పనిమనిషి వచ్చి అంట్ల గిన్నెలు తోమటం మొదలెట్టింది. పాలబ్బాయి బయట నుండి హారన్ మోగిస్తున్నాడు. "పాడు గోల! ఒక్క నిమిషం తీరికలేదు కదా!" అంటూ మిల్క్ బాయిలర్‌లో పాలు పోయించుకొంది రేణుక.

మరో పది నిముషాల్లో సునీత, సుమంత్ లేచి వంటగదిలోకి వచ్చారు. పిల్లల్ని చూడగానే "ఆఁ లేచారా! గబగబ బ్రష్ చేసుకోండి. గీజర్ ఆన్ చేశాను. స్నానాలు చేసి రండి. ఇదిగో పాలు రెడీ చేస్తున్నాను. తాగేసి హోమ్‌వర్క్ చేసుకోండి. ఊఁవెళ్ళండి" అంది రేణుక గబగబ పాఠం అప్పచెప్పినట్లు. "మమ్మీ! ఇవన్నీ రోజూ చేసే పనులే కదా! ఎందుకు మళ్ళీ మళ్ళీ చెబుతావు. మేం చేసుకోగలం కదా! మాకు తెలీదా!" అన్నాడు విసుగ్గా సుమంత్.

"అంతేలే! అమ్మకు రోజూ ఆ పాట అట్లా పాడందే తోచదులే" అంటూ తమ్ముడికి సపోర్టు పలికింది సునీత.

"ఔను! మీకేం అర్థమవుతుంది నా బాధ! ఇక్కడ ఇంత చాకిరీ చెయ్యాలి.. మళ్ళీ ఆఫీసుకెళ్ళి అక్కడ అరవ చాకిరీ చెయ్యాలి. చేసే వాళ్ళకు తెలుస్తుంది" రేణుక గట్టిగా మాట్లాడుతోంది. "ఏమిటి? పొద్దుటే ఏదో ఉపన్యాసం దంచుతున్నావ్" నవ్వుతూ అన్నాడు అప్పుడే అక్కడకు వచ్చిన పవన్.

"ఔను! మీకు నవ్వులాటగా ఉంటుంది. మీరొక్కరే ఈ పనులన్నీ సమర్థించండి. అపుడు తెలుస్తుంది మీకు." అంది రోషంగా రేణుక. "రేణూ! నీకు అప్పుడు చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నాను. నీవు ఉద్యోగం చేయకున్నా మనకు వచ్చిన లోటేమీ లేదు. నీవు మానేసినా మనకొచ్చిన కష్టమూ లేదు. నీవే ఏదో సరదాపడి చేస్తున్నావు... నీవు వద్దంటే మరొకరెవరికో అవసరమైన వారికి ఆ ఉద్యోగం దక్కుతుంది" పవన్ కొంచెం సీరియస్‌గానే అన్నాడు.

"మీరెపుడూ ఇంతే! ఏదో నా కష్టాన్ని గుర్తించి కొంచెం సానుభూతి చూబుతారని ఆశిస్తే మీరేమో..."

"నీవే కాదు.. నీలాటి చాలా మంది అవసరం లేకున్నా ఉద్యోగం చేయటం.. అదేదో లోకోద్ధరణకు చేస్తున్నట్లు మాట్లాడటం.. కాలక్షేపం కోసం కొందరు, స్టేటస్ కోసం కొందరు ఉద్యోగాలు చేస్తుంటే నిజంగా అవసరమైన వారికి ఉద్యోగాలు కరువైపోతున్నాయి...."

"ఏమిటంత సీరియస్ అయిపోయారు. ఇదిగో కాఫీ" అంటూ కప్పు అందించింది రేణుక.

"అయినా మనింట్లో ఎన్ని సౌకర్యాలున్నాయో చూడు. సమస్తం వున్నాయి. నీవు వంటపని చేసుకోలేనంటే వంటమనిషిని కూడా పెట్టుకోమన్నాను కదా"

"అబ్బా ఏదో కొంచెం విసుక్కున్నాను అంతే! మీరెళ్ళండి ఇక్కడి నుంచి మహానుభావా" అంటూ చేతులు జోడించి దణ్ణం పెట్టింది రేణుక.

కాఫీ కప్పుతో వరండాలోకి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు పవన్. పేపర్ చేతిలోకి తీసుకొని రెండు మూడు లైన్లు చదివాడు. చదవాలనిపించలేదు. రేణుక ఎందుకు ఎప్పుడూ అట్లా తన మీద తాను జాలి పడుతుంది. తనంతట తానే ఇష్టపూర్వకంగా ఆ

ఉద్యోగంలో చేరింది. పి.జి. చదివిన తాను ఊరికే కూర్చోటం ఇష్టం లేదని గొడవ పెట్టి మరీ ఈ ఉద్యోగంలో చేరింది. ప్రైవేటు కంపెనీ. నాలుగంకెల్లో జీతం. ఎప్పుడూ తానెక్కువ పని చేస్తుంటానని వాపోతుంటుంది. ఇట్లా రేణుక గురించి ఆలోచిస్తూ పేపర్ మడిచి పక్కన పడేశాడు. ఒకవేళ తాను ఆమెకేమైనా లోటు చేశాడా? ఉహూఁ అలాటిదేం లేదు. మంచి ఉద్యోగంలో వున్న తాను లోన్ తీసుకొని మంచి బిల్డింగ్ కట్టాడు. పిల్లలకు ప్రిస్టేజియస్ స్కూల్లో చదువు. ఇంట్లోకి కావలసినంత అధునాతన సామాగ్రి ఉంది. మరికొద్ది రోజుల్లో కారు కొనాలనే ప్లాన్‌లో వున్నాడు. మరి రేణుక ఎందుకో ఎప్పుడూ ఏదో కష్టపడిపోతున్నట్లుంటుంది. అసలు ఈ "సెల్ఫ్‌పిటీ" అనేది మొదలవకూడదు. అయిందా, అందరూ తననేదో 'ఎక్స్‌ప్లాయిట్' చేస్తున్నారనే భావన ఎక్కువవుతుంది. తనొక్కతే అందరికంటే ఎక్కువ శ్రమ చేస్తున్నట్లు రేణుక ఫీల్ అవుతోంది.

"డాడీ! ఈ ఇంగ్లీషు పోయెమ్ ఒకసారి చెప్పరా" అన్న సునీత పిలుపుతో పవన్ ఈ లోకంలోకి వచ్చాడు.

సుమంత్ – సునీతలనిద్దరినీ తన దగ్గర కూర్చోపెట్టుకొని ఆ రోజు పాఠాలన్నీ చదివించేడు.

రేణుక పిల్లలిద్దరికీ లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్సు సర్దింది మరో గంటలో.. వాళ్ళు స్కూల్‌కివెళ్ళారు.

పవన్ మరో అరగంటలో రెడీ అయి "రేణూ! నిన్ను బస్సుస్టాపు దగ్గర దింపి వెళ్తాను రా" అన్నాడు మోటర్ సైకిల్ తీస్తూ.

"వద్దు! నే వెళ్తాను." అంది రేణుక. అంతా వెళ్ళిపోయాక హాయిగా ప్రశాంతంగా కూర్చుని ఓ కప్పు కాఫీ తాగి తాపీగా నడచి వెళ్ళవచ్చని రేణుక ఉద్దేశం... తమ ఇంటి నుంచి ఐదు నిముషాల నడక. అంతే! హాయిగా కంపెనీ బస్ వచ్చి ఎక్కించుకొని అరగంటలో కంపెనీ గేట్‌లో దింపుతుంది. ఆటోతో కాని, రిక్షాతో కాని, సిటీబస్‌తో కానీ ఎక్కువవసరం లేదు. ఆ కొంచెం నడక నడిచి భార్య ఎక్కడ శ్రమ పడిపోతుందోనని పవన్ ప్రతిరోజూ డ్రాప్ చేస్తానంటాడు. రేణుక వద్దంటుంది.

తొమ్మిది గంటలకంతా ఇంట్లో నుంచి బయటపడతారు. ఐదు గంటలయ్యేసరికే అంతా ఇంటికి చేరుకొంటారు. రేణుక పిల్లల కోసం ఏదో ఒకటి తేవటమో, తయారు చేయటమో చేస్తుంది. ఓ గంట భార్యాభర్తలు కూచుని పిచ్చాపాటి మాట్లాడుకొంటారు. ఏడుగంటలకు వంట చేస్తుంది రేణుక. పిల్లలతో అవీ ఇవీ మాట్లాడుతూ టీవీ చూస్తారు ఎనిమిది గంటల వరకు. భోజనం చేస్తారంతా. పిల్లలు చదువుకోటంలో మునిగిపోతారు. భార్యాభర్తలు టీవీ చూస్తూ కబుర్లు చెప్పుకొంటూ పదిగంటలకు పడుకుంటారు. పవన్ తన ఈ జీవితం ఎంతో సౌఖ్యప్రదమైందని, భద్రమైందని పూర్తి తృప్తిగా ఉంటాడు. రేణుక రాత్రి పడుకోబోయే ముందు కూడా రేపటిని గురించి ఆలోచిస్తూ లేని కష్టాలతో ఆందోళన పడుతుంటుంది.

ఆ రోజు ఎప్పటిలాగానే సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చేక రేణుక మొక్కలకు నీళ్ళు పెడుతోంది. ఇంతలోనే 'కరివేపాకమ్మా కరివేపాకు' అని గట్టిగా కేక వినబడింది "ఇదేమిటి! పొద్దుటి పూట కాకుండా సాయంకాలం కూడా కరివేపాకు అమ్ముతున్నారా!" అని రేణుక ఆశ్చర్యపోయింది. "అయినా ఇవాళ సాయంకాలం చారు పెడదామనుకున్నాను కదా. కరివేపాకు ఉంటే బాగుంటుంది" అని అనుకొంటూ చేతిలో ట్యూబ్ కొబ్బరి పాదులో పెట్టి గేట్ వద్దకు వెళ్ళి 'ఏయ్! కరివేపాకమ్మాయ్ ఇలారా" అని కేక వేసింది.

తలమీద గంపతో చాలా వేగంగా నడుస్తూ వచ్చిందా అమ్మి. ముతక చీరె. సన్నటి శరీరం... తలమీద గుడ్డ చుట్ట కుదురులా... దాని మీద గంప..

సన్నటి పొడవాటి చేతులు ఊపుతూ గబగబ వచ్చింది.

'ఏమిటీ? కరివేపాకు ఉదయం కాకుండా సాయంత్రం అమ్ముతున్నావ్?' అడిగింది రేణుక.

"ఉదయం పూట వేరే యాపారం ఉంది తల్లి!" గంప కింద బెడుతూ అంది అమ్మి.

"అయితే ఇకరోజూ సాయంత్రం వేళే తెస్తావా?"

"ఆఁ రోజూ ఇదే టైంకి తెస్తాను"

"ఒక రూపాయిది ఇవ్వు. మాకు రోజు విడిచి రోజు ఇవ్వాలి మరి" అంది రేణుక.

'అట్టాగే అమ్మా' అంటూ కరివేపాకు మీద కప్పిన మాసిన బట్ట తీసింది. నవనవలాడుతూ, ఘుమఘుమ లాడుతూ కరివేపాకు, చిన్న కొమ్మ రేణుక చేతిలో ఉంచింది అమ్మి.

మరో రెండు నెలలు తిరిగే సరికి కరివేపాకు అమ్మే ముసలిది రేణుకకు బాగా చేరికయింది. ఆ రోజు ఆదివారం. రేణు, పవన్ పిల్లలతో వరండాలో కూర్చున్నారు. కరివేపాకు అమ్మి కేకవేయకుండానే గేట్ తీసుకొని లోపలికి వచ్చింది. రేణుక కాళ్ళదగ్గర గంప పెట్టి తాను కింద కూర్చుంది.

"ఏమిటి మామ్మా! ఈ వయసులో కూడా నీవెందుకింత కష్టపడి ఇల్లిల్లు తిరిగి కరివేపాకు అమ్మటం? ఇట్లా అమ్మకుంటే నీకు జరగదా?" రేణుక ఆప్యాయంగా మందలిస్తున్నట్లు అడిగింది.

"అదేంటి తల్లీ! అట్లా గంటావ్? నాకు దేవుడిచ్చిన కాళ్ళూ చేతులున్నాయి. శుభ్రంగా నడవగలను. చూడగలను. అట్టాటపుడు పాటుపడకుండా కూకొని ఎట్టా తినమంటావ్? అయినా నాకేమైనా రోగమా? రొష్పా?' ఈ మాతరం కాయకట్టం సెయ్యకుండా తిన్నదరుగుద్దా." కరివేపాకు అమ్మి సమాధానం.

"అంటే నిన్ను చూచేందుకు నీ కొడుకులు, కోడళ్ళు లేరా?"

"ఎందుకు లేరు ఉన్నారు తల్లి! అయితే ఆరికి నేనేమైనా మూటలిచ్చానా? ముల్లెలిచ్చానా! సేతులిచ్చా కట్టపడమని అంతే? ఆల్లకట్టమేదో ఆల్లుపడుతున్నారు. భగమంతుని దయవల్ల నన్ను ఆలు సూడక్కర్లే. నేను ఆల్లని సూడక్కర్లే "ఇయాల ఆదివోరం కదా, తీరికగా కూచున్నారు. మాకు సెలవేది తల్లీ.. ఇదిగో కరివేపాకు తీసుకోమ్మా" అంటూ గంప ఎత్తుకొంది నెత్తికి మామ్మ.

ఆదివారం సెలవు అనే మాటకు రేణుక అంగీకరించినట్లు తల వూపుతూ "ఏమిటి సెలవు దినం. ఆదివారం ఎంతపనుంటుందనుకొన్నావ్. పొద్దుటమొదలెడితే ఇపుడయింది. పని చేయలేక చచ్చిపోతున్నాననుకో" అంది.

"అయ్యో! అట్టా మాటాడకు తల్లీ! పనిసేస్కోలేక సచ్చిపోటమెందుకమ్మా! మీకేం మారాజులు. గుడ్డలుతికేది, ఇల్లు తుడిసేది, పప్పు రుబ్బేది అన్నీ ఉంటాయిగా తల్లీ. "ఇక వంట ఒకటే గందా! అది కూడా పుల్లలు, అన్నం వోర్చటం, మసాలా నూరుకోటం ఏదీ లేదుగా తల్లీ... అన్నీ బేగిబేగి తయారయితాయంటగా."

"ఆ వంట మాత్రం తేలికయిందా?"

'అట్టనకు తల్లీ! మనం తినేదానికే గందా వండుకొనేది! ఆ మాత్రం పని సేయకుంటే ఈ వల్లు మాటింటాదా?"

"అట్లాగే అనుకొంటారు మీలాటి వాళ్ళు! ఇన్ని ఉన్నా హాయిగా తీరికగా కూర్చుని తింటానికుండదు. అంతా హడావుడి అనుకో! అయినా నాకు వంట చేసేందుకు ఒక మనిషి కావాలి. మంచి నమ్మకమైనది కావాలి. చూసి పెడతావా?"

"ఏమో తల్లీ! సూడమంటే చూత్తానుగాని బోలెడంత అడుగుతారు. దండగమ్మా:" అంటూ వెళ్ళింది.

మరో నాలుగు రోజుల పాటు రేణుక మామూలుగా వంట చేస్తూ, విసుక్కుంటూ గడిపింది. మధ్యమధ్యలో ఏదో ఒక నిముషంలో కరివేపాకు అమ్మి సడన్‌గా వచ్చి తనకో వంటమనిషిని అప్పచెబుతుందని ఆశగా చూడసాగింది. నాలుగు రోజుల నుండి కనిపించని ఆమె మీద కోపం ఎక్కువయింది.

ఆ రోజు ఆఫీసు నుంచి వచ్చీరాగానే కరివేపాకు అమ్మి ప్రత్యక్షం అయింది. ఆవిడ్ని చూడగానే రేణుక ముఖం చాటంతయింది. ముందే తను వంటమనిషిని గురించి అడిగితేబాగుండదని నవ్వుతూ అంది, "ఏం మామ్మా! నాలుగు రోజుల నుండి కనిపించటం మానేశావ్?" "ఏం ఉంది తల్లీ!

(మిగతా 23వ పేజీలో)

పుస్తక పరిచయం

యూరప్ ఖండ సమగ్ర దర్శనం

చిత్తూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డిగారి యూరప్ జ్ఞాపకాలు ఒక మంచి యాత్రా గ్రంథంగా పాఠకులను చక్కగా ఆకర్షించగలుగుతున్నది. నిరాడంబరమైన, సరళమైన, సజీవమైన భాషాశైలి చదువరుల చేత పుస్తకాన్ని మరింత వేగంగా చదివించగలుతున్నది.

తమ బంధు మిత్రులతో యూరప్ దేశాల పర్యటనకు బయలుదేరిన రచయిత ప్రసిద్ధ పర్యాటక సంస్థ థామస్ కుక్ నిర్దిష్ట మార్గదర్శకత్వంలో ప్రయాణించినా, ఇతర మామూలు పర్యాటకుల వలెగాక, తమ అభిరుచుల మేరకు చారిత్రక, నూతన స్థలాలను సందర్శించి, వాటిని "ముందుమాట"లో ఆయనే తెలియజేసినట్టు ఆధునిక పాశ్చాత్య దేశాలైన అమెరికా, ఆస్ట్రేలియా, వాటికన్నా పాత దేశాలైన బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ లాంటి దేశాలను సందర్శించాలనే కోరికే చాలా కాలంగా ఆయనలో బలంగా వుంటూ వచ్చింది. అందుకు కారణం మానవజాతి పురోగమనాన్నే వేగిరపరచిన సైన్స్ ఆవిష్కరణలు, సాంస్కృతిక పునరుజ్జీవనం, పారిశ్రామిక విప్లవాలు యూరప్‌లోనే సంభవించాయని రచయిత సరిగానే భావించారు. ఆధునిక ప్రజాస్వామ్యం వేళ్లూనుకున్నా ఈనాటికీ యూరపు దేశాలలో వైభవోపేతమైన రాజభవనాలు, రాజరిక చిహ్నాలు సందర్శించాలని ఆయన ఉవ్విళ్లూరుతూ వచ్చారు. దీని ఫలితంగా 'యూరప్ జ్ఞాపకాలు' గ్రంథం ఆమూలాగ్రం ఉల్లాసంగా చదివించే విజ్ఞానయుత సమాచార పేటికగా సైతం భాసిల్లింది.



యూరప్ జ్ఞాపకాలు
రచన : కట్టమంచి బాలకృష్ణారెడ్డి
వెల : 50/-;
ప్రతులకు : కట్టమంచి బాలకృష్ణారెడ్డి, లుంబిని గార్డెన్, కట్టమంచి, చిత్తూరు జిల్లా.

ఈ యాత్రా పుస్తకంలోని ముఖ్యమైన అంశమేమంటే, రచయిత ఆయా స్థలాలను సందర్శించేటపుడు, అంతకు మునుపు వాటి గురించి ఆయన చరిత్ర పుస్తకాలలో చదివిన విషయాలను జ్ఞప్తికి తెచ్చుకొని ఆ వివరాలను పాఠకులకు సమగ్రంగా అందించారు. ఈ పద్ధతే పుస్తక ప్రయోజనాన్ని పెంచివేసింది. ఇందుకు రచయిత బహుధా అభినందనీయులు. చిన్నచిన్న వాక్యాలతో ఆయా దృశ్యాల సమగ్ర చిత్రాన్ని చదువరుల మనసులో ఆవిష్కరించడంలో రచయిత సఫలురయ్యారనే చెప్పవచ్చు. ఉదాహరణకు "ఫ్రాన్స్ రాజధాని పేరిస్‌లో పడవ నదిలో ప్రయాణించేటపుడు అనేక వంతెనల కింద వెళుతుంది. పేరిస్‌ను సీనే నది రెండుగా విభజిస్తుంది. సగం పట్టణం తూర్పు తట్టు, సగం పట్టణం పడమరతట్టు".

బాలకృష్ణారెడ్డి గారు 'యూరప్ జ్ఞాపకాలు' పుస్తకాన్ని ఒక నిస్తేజమైన టూరిస్టు బ్రోచర్‌గా రూపొందించకుండా తను వ్యక్తిగతానుభవాలనూ, స్పందనలనూ మేళవించి రచించడం విశేషం. ఆయన తన యాత్రా వర్ణనలో తమ సతీమణి, బృందంలోనిఇతర సభ్యుల కార్యకలాపాలను కూడా ఎడనెడా పేర్కొనడం వలన నిండుదనం సమకూరింది. అక్కడక్కడా చెణుకులు, విసుర్లు కూడా లేకపోలేదు. ఇవి మనల్ని కడుపుబ్బానవ్వించకపోయినా, మన పెదవులపై చిరుదరహాసాలను పూయిస్తాయి.

దీనికో ఉదాహరణ : బహిరంగ ప్రదేశంలో గాఢంగా చుంబించుకుంటున్న పాశ్చాత్య జంటనుకెమెరాలు 'క్లిక్' చేయడానికి రచయిత వుద్యుక్తులవడం, దీనిని గమనించిన ఆయన సతీమణి, 'ఫోటో తీయడానికి మీకు ఇది తప్ప వేరే దొరకలేదా'? అని ఆయన్ని మందలించడం.

ఆత్మకథ శైలిలో యాత్రా వర్ణనలు చేసే రచయితలకు తమ పర్యటనానుభవాలు ఏవీ దాయకుండా వ్రాసే నిజాయితీ వుండాలంటారు. ఆ నిజాయితీ ఈ రచయితలో వుండటం ముదావహం. ఆయన పేరిస్ నగరంలో 'లిడో' అనే అందమైన అమ్మాయిల నైట్ షో చూడటం, పేరిస్ చాపేన్‌ను రుచిచూడటం, పోర్క్‌సేవన గురించి నిజాయితీగా వర్ణించడం ముదావహం.

ఆయన సందర్శించిన వివిధ స్థలాలను సూచించే పటం గ్రంథం ముఖచిత్రంగా ఇవ్వడం పాఠకుల అవగాహనకు తోడ్పడుతుంది. పర్యటనలో ఛాయా చిత్రాలను పుస్తకంలో పుష్కలంగా ఇవ్వడం వలన పుస్తకం అందం అధికమవడమే గాక, చదువరుల ఎదుట అవి దృశ్య మాలికలను తెచ్చి నిలబెడతాయి. చక్కటి ముద్రణకు దీనిని తార్కాణంగా చూపవచ్చు.

ఈ సమీక్షకునికైతే ఈ పుస్తకంలో మరికొన్ని వివరాలు ఇచ్చి వుంటే బాగుండుననిపిస్తోంది. రచయిత లండన్‌లోని ప్రసిద్ధ హైడ్ పార్క్‌ను సందర్శించినపుడు అక్కడ పచ్చికపై కూర్చొని ముచ్చట్లాడుకొంటున్న ప్రేమజంటలు, వృద్ధ దంపతుల గురించి చెప్పాడే కానీ, అక్కడే ఉన్న నవయుగ వైతాళికుడు కారల్‌మార్క్స్ శిలా విగ్రహం గురించి ప్రస్తావించలేదు.

రచయిత సందర్శించిన యూరప్ దేశాలన్నీ సంపదలోను, పరిశ్రమలలోను, నాగరికతలోను, విద్యా విజ్ఞాన రంగాలలోను అపారంగా అభివృద్ధి చెంది వున్న వైనాన్ని మనకు స్పష్టంగా వివరించారు. అయితే ఒక్క స్విట్జర్లాండు మినహా మిగిలిన దేశాలన్నీ ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా ఖండాల్లోని తృతీయ ప్రపంచదేశాలను తమ ఆయుధబలంతో మారణహోమాలను గావించి. బానిసలను చేసుకుని, వాటి సంపదనంతా దోచుకొని తెచ్చి తమ దేశాలను సంపద్వంతం' చేసుకొన్నాయనే విషయాన్ని రచయిత రేఖా మాత్రంగానైనా సూచించి వుంటే బాగుండేది.

మొత్తంలో బాలకృష్ణారెడ్డిగారి 'యూరప్ జ్ఞాపకాలు' పాఠకులను కూడా తమతోపాటు ఆయా దేశాలకు తీసుకెళ్లి సందర్శింపచేస్తాయి.

*** ఎ.జి.యతిరాజులు**

స్వీకారం

ప్రకృతి శాపం – పాలకుల పాపం
ఫ్లోరోసిస్
రచన : డాక్టర్ పానుగోటి కృష్ణారెడ్డి
వెల : 25/-; **ప్రతులకు :** టి.ప్రభాకర్‌రెడ్డి, ఇ.నెం.12-13-438, స్ట్రీట్ నెం.1, తార్నాక, సికింద్రాబాద్; అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో

శ్రీలేఖ (కథాసంకలనం)
సంపాదకులు: డాక్టర్ టి. శ్రీరంగస్వామి;
వెల : 60/-; **ప్రతులకు :** శ్రీలేఖ సాహితి, ఇ.నెం.5-11-481, విద్యారణ్యపురి, హన్మకొండ; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఉషస్సు
రచన : మహేశ్వరపు నరేందర్‌రెడ్డి
వెల : 20/-, **ప్రతులకు :** శ్రీలేఖ సాహితి, ఇ.నెం.5-11-481, విద్యారణ్యపురి, హన్మకొండ; ఎం.రామచంద్రారెడ్డి, దమ్మన్నపేట, వయా జఫర్‌గఢ్, వర్ధన్నపేట మండలం, వరంగల్ జిల్లా; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

గోడల నుంచి వీరికి విముక్తి లభించింది.

***

2002 మే 10 నుండి 2003 ఫిబ్రవరి 24 మధ్యకాలంలో తమ భర్తలు కుటుంబానికి దూరంకావడంతో అక్కా చెల్లెళ్ళ జీవితాలు అతలాకుతలం అయ్యాయి.

గుజరాత్ వెళ్ళిన నర్సింహులు పాకిస్తాన్ అధికారులకు చిక్కక ముందు సంపాదించిన పదివేల రూపాయలు పోగొట్టుకున్నాడు. ఇతను చేపల వేటకు వెళ్ళిన సమయంలో రామలక్ష్మి తన ముగ్గురు పిల్లల్ని, తల్లిని, అత్తనూ పోషించేది. ఎండుచేపలు అమ్ముతూ తన కుటుంబాన్ని అతి కష్టం మీద సాకింది.

రామలక్ష్మి చెల్లెలు తులసమ్మ తన భర్త కృష్ణ చేపల వేటకు వెళ్ళిన సమయంలో గర్భిణిగా ఉంది. ఈ మధ్య కాలంలో బిడ్డ పుట్టడం... ఆమె అనారోగ్యానికి గురికావడంతో వైద్యం చేయించడానికి అయిదువేల రూపాయలు ఖర్చు చేసింది. అయినప్పటికీ బిడ్డ దక్కలేదు.

తమ భర్తలు జైలు శిక్షతో అనారోగ్యం పాలైనప్పటికీ తమ కళ్ళ ఎదుట ఉన్నందుకు వారు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. పది నెలల తర్వాత తిరిగి వచ్చిన వారి కోసం పిండివంటలు చేశారు. వీరి ఆనందం ఆ చిన్న మత్స్యకార గ్రామాల్లో కూడా సంతోషాన్ని నింపింది. ◆



నర్సింహులు భార్యా బిడ్డలు

కరివేపాకు మామ్మ

(19వ పేజీ తరువాయి)

కరేపాకు తరిగిపోయింది. మళ్లీ సెట్టంతా సిగిర్చి ఇరగ కాసే దాకా ఏదో ఒక పని చూసుకోవాలి గదా! సాయంకాలం గిన్నెలు తోమటానికి ఓ రెండిళ్ళు కుదుర్చుకొన్నాను. ఆ రెండిళ్ళు మాగుడిసె కాడే! ఊరకే కూకుంటే గడవదు గదా! పొద్దుటేల ఇడ్లీలేసి అమ్ముతున్నా! మజ్జాన్నం కాడ అదేదో బడమ్మా.. ఆ బల్లోకి పదిమందికి కారేజీలు పట్టుకెల్తా! అయో రెండొందలు వత్తాయి.. ఈటెల్లోనే నా ఖర్చులు పోను రోజుకో మూడు రూపాయలు సీటి కడతా! అయ్యెట్టి నా మనవలకి ఏదో ఒకటి కొంటాను... పొద్దుటేల లేసింది మొదలుకొని పడుకోబోయే దాక ఏదో ఒహటి చేస్తాను తల్లీ! ఇంకా ఆరు ఈరు జెప్పిన సిల్లర మల్లర పనులు చేత్తాను. ఈ కరేపాకు చెట్టు ఏనాటిదో! నా గుడిసె ముందు ఎపుడో పెట్టాడంట నా మొగుడు. అదే నాకిపుడింత ఆధారమయింది... పొలం పనులు, కట్టుబడి పనులకు ఎల్లలేను తల్లీ! అందుకే తేలికైన పనులు చేసి పొట్టబోసుకొంటున్నాను... పిల్లలకి బారం కాకూడదు కదమ్మా.. ఇంతకీ వంటకి ఎవరూ దొరకలేదమ్మా! మీరు పాపం ఎదురు చూస్తుంటారు చెబుదామని వచ్చినా..."

"మామ్మా! ఇన్ని పనులు చేస్తుంటే నీకు ఆయాసం, అలుపు లేవా? విశ్రాంతి తీసుకోవాలని ఉండదా?"

"అట్టాటివేవీ లేవు తల్లీ! అసలు పని చేయకుండా తొం గుంటే ఏదో జబ్బొచ్చినట్లుంటాది. నా కొడుకూ కోడలు పొద్దుటేల ఇంత గంజితాగి బువ్వట్టు కొని పనిలో కెల్తారు. పిచ్చి ఎదవలు ఆళ్ళు వచ్చేతలకే సాయంకాలం అంత ఏడిఏడిగా ఉడకేసి పెడతాను. ఆవురావురంటూ ఆళ్ళింత తింటారు. నేనింత తిని పడుంటాను. పేనం ఎటుపోతుందో! హాయిగా నిద్రడుతుంది తల్లీ! అదే ఇశ్రాంతి.. పొద్దుటే సూరీడి కంటే ముందు లెగుస్తాను."

"మామ్మా! అట్లా యంత్రంలా పనిజేస్తే అరిగిపోతావ్ తెలుసా?" రేణుక సానుభూతి చూపుతూ అంది.

"ఏమో అయన్నీ తెలీవు. నాకింత మటుకు ఏ రోగం రొప్పు లేదు. దేవుడు మమ్మల్నిట్టా కట్టబడమని రాసాడు. మాదొకలాటి పాటు - మీదొకలాటి పాటు. కాని సేసే పని ఇట్టంగా సేయాలి కదా తల్లీ! అట్టా సేస్తేనే గందా మనకు సుకం. అయినా నా పిల్లలకు బరువు కాకుండా నా పని నేజేసుకొని పొట్టోసుకొంటున్నాను. నేను పని జేత్తా వుండగానే నా పేనం పోవాలి గాని తల్లీ! కూకొని తినకూడదు. నాకట్టా అనుకొంటేనే సిగ్గుగా ఉంది..."

రేణుక ఏమీ మాట్లాడలేదు.. కరివేపాకు అమ్మి గంప నెత్తినెట్టుకోటం 'మరి వత్తాను తల్లీ! మళ్ళీ కనబడతాను" అంటూ వెళ్ళటం కూడా గమనించలేదు..

ఆ తర్వాత వంట చేసేటపుడు, భోజనాలు చేసేటపుడు కూడా ఎవరితోనూ ఎక్కువ మాట్లాడలేదు రేణుక.

"ఏం రేణూ! ఎందుకట్టా వున్నావ్" అని పదేపదే అడిగిన పవన్‌తో "ఏం లేదు" అనే సమాధానమే చెప్పింది.

రాత్రి మెత్తటి పరుపు మీద పడుకొన్నా నిద్రపట్టడంలేదు. ఎదురుగా ఎయిర్ కూలర్. టేబుల్ మీద కలర్‌టి.వి. నిద్రలేచింది మొదలుకొని ఏ వస్తువుకూ వెతుక్కోనవసరం లేదు.. మంచి పౌష్టికాహారం.. పండ్లు.. పాలు, జీడిపప్పు.. బాదం పప్పు.. రకరకాల తినుబండారాలు.. తననింకా ఇంకా సుఖపెట్టాలనుకొనే భర్త! కారు కొనాలనే అతని తపన.. తానయితే ఎందుకింత అసంతృప్తిగా ఉంటుంది. తాను చేసేది ఒక్క వంటపని... అదీ దేశాన్ని ఉద్ధరించటానికి కాదు. తనకి, తన భర్తకి, పిల్లలకి చేస్తోంది.. ఈ భూమ్మీద తానొక్కతే విపరీతమైన శ్రమ పడిపోతున్నట్లు తాననుకొంటోంది. అసలు పూర్వం రోజుల్లో అమ్మలు, అమ్మమ్మలు ఇన్ని సౌకర్యాలు లేకుండా అంతంత మంది పిల్లల్ని ఎట్టా పెంచారో! పరిమిత సంతానంతో, రకరకాల రెడీమేడ్ ఫుడ్స్‌తో కూడా ఇవాల్టి స్త్రీలు ఎందుకింత సతమతమవుతున్నారు? ఈనాటి వారిలో సహనం, ఓపిక తక్కువా? లేక ఏదో సాధించాలనే తపనతో 'కెరీర్' గురించి ఆలోచనతో మోయలేని భారం మోస్తున్నారా? అస్సలు తన మటుకు తనకు ఉద్యోగం ఎందుకు ? అదొక స్టేటస్. ప్రతి రోజూ తయారై, బ్యాగ్ తగిలించుకొని డ్యూటీకి వెళ్తుంటే ఎంత తృప్తి! ఇంతకాలం తానేదో తెగ కష్టపడిపోతున్నానని ఏమేమో అనుకొనేది. నిజానికి! ఆ కరివేపాకు అమ్మితో పోల్చుకుంటే తాను ఆమె పడే శ్రమలో వందోవంతు పడుతుందా? అయితే ఆ అమ్మి తానను భవించే సుఖాలలో వందో వంతు అనుభవిస్తుందా? అయినా ఆమెలో ఎంత సంతోషం! ఎంత తృప్తి! ఎంత ఆత్మవిశ్వాసం! ఎంతటి నిలకడ!

నాకిది లేదు, అది లేదు అని అనకుండా ఉన్నంతలో తన జీవితాన్ని ఎంత అద్భుతంగా గడుపుతోంది. అసలు తనకు జీవితమంటే ఏ మాత్రం అవగాహన లేదు. ఆ నిముషంలో కరివేపాకు అమ్మే మామ్మ రేణుక కంటికి ఓ గొప్ప బోధకుడిలా, శ్రీకృష్ణుడిలా అనిపించింది.

"రేణూ! ఇంకా నిద్రపోలేదా?" రేణుకను దగ్గరకు తీసుకొంటూ అడిగాడు పవన్.

"లేదండీ! ఇవాళ నాకు గొప్ప జ్ఞానోదయం అయింది.."

"ఇంతకీ ఏ స్వాముల వల్ల, బాబాల వల్ల అయింది? లేదా అమ్మల వల్ల అయిందో తెలుసుకోవచ్చా?"

"ఆఁతెలుసుకోవచ్చు! మీకూ తెలిసినావిడే! మన కరివేపాకు అమ్మి వల్ల"

"ఆఁ" అంటూ పవన్ నోరు తెరిచాడు. ◆

సో....

*కొండబాబు

ఒక కొత్త సినిమా తాలూకూ కొత్త హీరోయిన్‌తో టీవీలో కార్యక్రమం వస్తోంది.

... సో.. మై డైరెక్టర్ ఈజ్ వెరీగుడ్... హీ ఈజ్ కలెక్టింగ్ గుడ్ యాక్షన్ ఫ్రం ఆర్టిస్ట్స్.. ఎస్పెషల్లీ ఫ్రం మీ..., సో.. స్టోరీ ఈజ్ గుడ్... మై కోఆర్టిస్ట్స్ ఆర్ కో-ఆపరేటివ్..., గుడ్.."

"మీరు ముంబైతారా?" యాంకర్ ప్రశ్న

"నో... నో.. ఐ స్టడీడ్ ఇన్ హైద్రాబాద్..." - ఇలా 'ఇంగ్లీషు'లో సాగిపోతోంది కార్యక్రమం.

* * *

"అసలు ఇది యుద్ధం ఎలా అవుతుంది ? యుద్ధమంటే పరస్పరం తలపడటం.. కానీ ఇది అట్లా లేదే. ఇరాక్ యుద్ధానికి రాలేదు కదా! అమెరికాయే ఇరాక్‌పై దాడికి దిగింది. ఇది దాడి..., దురాక్రమణ తప్ప యుద్ధం కాదు" ఆవేశంగా చెప్పాడు వివేకానంద.

"నో.. నేనంగీకరించను... ప్రపంచానికే ఇరాక్ ప్రమాదకరంగా ఉందని అమెరికా చెబుతున్నది కరెక్ట్.. తట్స్‌వై జీవరసాయనాయుధాలతో ఇరాక్ దాడికి సిద్ధంగా ఉంది కాబట్టే, అమెరికా యుద్ధం మొదలెట్టింది" జస్వంత్ చెప్పాడు. వారిద్దరూ ఫ్రెండ్స్. జస్వంత్ రాజధానిలో చదువుతూ సెలవులకొచ్చాడు. వివేకానంద ఉన్న ఊళ్లోనే చదువుతున్నాడు... ఇద్దరి మధ్య వార్ గురించి వాదన.

"జీవరసాయనాలు ఉన్నాయని తనిఖీ బృందాలే నిర్ధారించలేదు.. అయినా నీ దగ్గర ఏదో బాంబు ఉందని ఆరోపించి... నిన్ను ముందే కొడితే నువ్వూరుకుంటావా?... ఇదెలాగుందంటే... మన పల్లెటూళ్ళలో చేతబడులు చేస్తాడని సాకు చూపి చంపుతారు.. చూడు అలాగుంది" కోపం, వెటకారం కలిపి అన్నాడు వివేకానంద.

"నో... ఐ డోన్ట్ యాక్సెప్ట్ యూ... వివేక్..., యూ ఆర్ మిస్టేకన్.. యాజ్ ఎ మేజర్ కంట్రీ, అమెరికా హేజ్ ఎ రెస్పాన్స్‌బిలిటీ టూ ప్రొటెక్ట్ ది వరల్డ్ పీపుల్స్.. అండ్ వరల్డ్ పీస్.. దట్స్‌వై... ది వార్ ఆన్ ఇరాక్ ఈజ్ కరెక్ట్..." ఆగాడు "యూ హ్యావ్ టూ అండర్‌స్టాండ్ లైక్‌దట్..." మళ్ళీ అన్నాడు.

వివేకానంద ఆగిపోయాడు. "కావచ్చు..." అన్నాడు గొణుగుతున్నట్లు...

మిత్రుడిపై విజయం సాధించినట్లు నవ్వాడు వివేక్...

* * *

పేర్కొన్న టీవీ కార్యక్రమంలో నటి



తెలుగమ్మాయే కానీ, ఇంగ్లీషులోనే మాట్లాడుతోంది.. పోనీ, తన భావాలను, చెప్పదలచుకున్న విషయాలను స్పష్టంగా చెప్పగలుగుతోందా? అంటే లేదు. తడుముకుంటూ... మధ్యలో 'సో' అంటూ... బహుశా ఇలా చెప్పడమూ సినిమా గ్లామర్ సొగసేనేమో.

ఇక, ఇరాక్ గురించి మిత్రుల సంభాషణను పరిశీలిద్దాం. ఈ సంభాషణలో వివేకానంద చాలా స్పష్టంగా.. రీజనింగ్‌తో తన అభిప్రాయాలను వెల్లడిస్తూ వచ్చాడు.. జస్వంత్ అభిప్రాయాల్లో స్పష్టతా లేదు. రీజనింగూ రాలేదు. కానీ వివేకానంద వాదనలో ఎందుకు గెలవలేకపోయాడు. ఎందుకంటే జస్వంత్ అకస్మాత్తుగా ఇంగ్లీషులోకి మారడంతో ఆ భాషలో సంభాషించలేక వివేక్ అర్థాంతరంగా మౌనభాషి అయ్యాడు. ఇలా వాస్తవ జీవితంలో చాలాసార్లు జరుగుతూంటుంది. ఇలాంటి అనుభవాలు చాలా మందికి ఎదురవుతుంటాయి.

వాస్తవం చూస్తే వివేక్‌కు విషయావగాహన ఉంది. జస్వంత్‌కు లేదు. కానీ భాషాధిపత్యంతో నెగ్గు(?)కొచ్చాడు. అతనికి గానీ, అతను మాట్లాడిన భాషకు గానీ ఆధిపత్యం ఎవరిచ్చారు ? ఎందుకిచ్చారు? అనేవి ప్రశ్నలు.

ఇలాంటి సన్నివేశాలు గతంలో కొన్ని సినిమాల్లో అనుసరణీయంగా ఉండేవి. యాంటీహీరో పాత్రలు ఇంగ్లీషులో మాట్లాడితే "తెలుగులో మాట్లాడవోయ్" అంటూ హీరో పాత్రలు గదమాయించేవి.

వాస్తవం చూస్తే సబ్జెక్టు వేరు లాంగ్వేజ్ వేరు. విషయం, భాష ఒకటి కాదు. ఒక విషయంపై వాదన జరిగేప్పుడు తెలిసిన భాషలో లేదా మాతృభాషలోనే పట్టుగా వాదించగలం. వేరే భాషలో అలా వాదించలేము. విషయంతో పాటు భాషకోసమూ శ్రమపడాల్సి ఉంటుంది. దీనిని ఆసరా చేసుకునే విషయం తెలియని వాళ్ళు కొందరు ఎదుటివారిని న్యూనతకు గురి చేసి 'భాషతో అధిక్యం సాధించాలని చూస్తారు. దానిని సాగనివ్వకూడదు. స్పష్టంగా తెలిసిన భాషలో మాట్లాడమని' అడగాలి.

చదువుకోవడం అంటే భాష తెలిసుండటం కాదు. విషయాలు (సబ్జెక్టు) తెలిసుండటం.

కొన్ని నాటకాలు, సినిమాల్లో చదువుకోవడం అంటే ఆంగ్లం తెలిసుండటంగా సన్నివేశాలున్నాయి. ఒక సినిమాలో ఒక క్యారెక్టర్ 'నేను చదువుకున్న వాళ్ళ గురించి మాట్లాడుతున్నాను' అంటాడు. వెంటనే మరో పాత్ర తాను చదువుకున్న వ్యక్తినని చెప్పడానికి "సీ మిస్టర్ గాంధీ..." అంటూ ఆంగ్లంలోకి మారిపోతారు. ఇలాంటివి ఆంగ్లం తెలియని వారిని న్యూనతకు గురి చేస్తాయి. దోపిడీ వర్గాలు అదుపు చేయడానికి, ఆధిక్యం సాధించడానికి అనుసరించే మార్గాల్లో ఇదొకటి. ఆ చట్రంలో కొందరు సామాన్యులు చిక్కుకుపోయి ప్రవర్తిస్తుంటారు.

కాబట్టి తెలుగువాళ్లతో తెలుగే మాట్లాడాలి. రాయాలి. వేరే భాషల వారిలో మాట్లాడడానికి అనువుగా ఇంగ్లీషు నేర్వడం, భాషపై పట్టు సాధించడం తప్పు కాదు. పైగా అది నేటి అవసరం కూడా. ఈ అదనపు అవసరం ప్రాథమికం కాకూడదు. భాషా దాస్యం చోటు చేసుకోకూడదు. మాతృభాష, భాషీయులు అవమానానికి గురికాకూడదు. ఇదంతా ఆచరణాత్మకంగా ఉండాలి. ◆

పాఠక స్పందన

అదాలత్ కథలు బాగున్నాయి

మార్చి 23 సంచికలో అదాలత్ కథలు శీర్షికన ప్రచురించిన ఉరిశిక్ష మానవత్వాన్ని మంటగలిపి రాక్షసత్వాన్ని ఒంటబట్టించుకున్న ఉన్మాదులను నడివీధిలో నిలబెట్టి నలుగురిలో నిలువునా నరికేసినా పాపం లేదు. అడుగడుగునా ఆడవారికి జరుగుతున్న అన్యాయాలను ఉన్మాదుల నుండి తక్షణమే రక్షించగలిగితే ఈ లోకంలో ఉన్మాదులకు చోటుండదు.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

ఆస్ట్రేలియా పటిష్టమైన జట్టు

మార్చి 23 సంచికలో క్రీడారంగం శీర్షికన ప్రచురించిన 'ఆస్ట్రేలియా జైత్రయాత్ర' వ్యాసం చాలా బాగుంది. ఆస్ట్రేలియా సృష్టించిన రికార్డుల గురించి చాలా వివరంగా తెలియజేశారు. ఇంత పటిష్టమైన జట్టుగా వున్న ఆస్ట్రేలియా చివరకు కుయుక్తులకు పాల్పడం ఏమీ బాగాలేదు. మ్యాచ్ జరిగేటప్పుడు ఎదుటి జట్టును పరుషమైన వ్యాఖ్యలు చేస్తున్న ఆస్ట్రేలియాపై ఐ.సి.సి. చర్య తీసుకుంటే భవిష్యత్‌లో అవి పునరావృతం కాకుండా వుంటాయి.

- రాధాకృష్ణ, హైదరాబాద్